తెలిసుంటే చదవకపోయేవాణ్ణి :

# తల్లీ పిల్లల్ని విడదీసే బానిస చదువు....

* సూరిసెట్టి సాంబశివరావుబాబ్జీ *

★

మా అమ్మా, నాన్నా ఆ వేళ సాయంకాలం నన్ను సాగనంపేందుకి స్టేషనుకొచ్చారు. నా స్నేహితులుకూడా నాకు వీడ్కోలు ఇవ్వటానికి అయిదయ్యేప్పటికంతా ప్లాట్ ఫారంమీద హాజరై పోయారు, ఇంతమందితో పరామర్శించేందుకి నా కళ్ళే అందర్తోనూ పోట్లాడసాగినై. నా కళ్ళలోని విచారాన్నీ-భావాల్నీ తెలుసుకుని వాళ్ళు కూడా అంతగా నొక్కి అడగలేకపోయారు.

అసలు ముఖ్యంగా మా అమ్మా-నాన్నా—

నన్నింతవరకూ అల్లారుముద్దుగా పెంచి పెద్దవాణ్ణి చేసి చదివించిన మా నాన్ననీ-తనకి లేకపోయినా పసుకూడా పడుండి రేపనురోజుల్లో కడుపునిండా తిండిపెట్టి నా సుకుమారదేహాన్ని ఎండా కందనీయకుండా ఓ పుష్పానికిమల్లే కాపాడుతూ వొచ్చిన మా అమ్మనీ-విడిచిపెట్టి వెళ్ళటానికి నా మనసేమాత్రమూ అంగీకరించకపోయినా స్వతంత్రంగా జీవించే తెరవులేక పరాయివాడి బానిసోద్యోగంకోసం బయల్దేరి వెళ్ళాల్సొచ్చింది.

మా నాన్న దేశాన్ని ప్రేమించే ఓ త్యాగి-దేశంకోసం-దేశస్వాతంత్ర్యంకోసం-తన జీవితాన్నంతా అర్పించిన నిరాడంబరజీవి - యీనాడు ధనికవర్గమువారితో - పదవులకోసం ప్రాకులాడే దొంగబురఖాల్తో నిండిపోయి తన పేరుప్రతిష్ఠల్ని నిర్నామధామం చేసుకుంటూన్న కాంగ్రెసుకోసరం తనదేహంలోని అంగఅంగమూ బలియిచ్చేసిన పవిత్రమూర్తి - పగలనక, రాత్రనక పల్లెపల్లెకూ నిద్రాహారాలు లెక్కచెయ్యకుండా తిరిగి తిరిగి జాతీయప్రబోధం కావించి కాంగ్రెసు కీర్తిని మూలమూలకీ వ్యాపింపజేసేందుకు అష్టకష్టాలపాలయిన ప్రజాసేవకుడు - జాతీయ విద్రోహులైన నాటి కమ్యూనిష్టుల దురంతాలకి గురయిన అహింసా స్వరూపుడు - కాంగ్రెసు జండాని శాశ్వతంగా నిలబెట్టేందుకి వేలాదివేల రూపాయిలు కాలదన్నిన నిష్కామయోగి - బూటకాల్లో, ఆడంబరాల్లో, పటాటోపాల్లో, బ్లాక్ మార్కెట్లతో, లంచాలతో నిండి యీ పాపభూయిష్టమైన యీ కలియుగంలో జీవించతగ్గ వ్యక్తి కాడు - అంత యెక్కువగా చదువుకున్న మనిషి కాదు. ఎన్నెన్నో కష్టాలుపడి, యెన్నెన్నో అవాంతరాలనీది, యెందరెందరి కాళ్ళో పట్టుకుని నన్నింతగా చదివించాడు. యీనాడు నాకు గవర్నమెంటుద్యోగం దొరికిందీ అంటే అదంతా ఆయన కృపాకటాక్షమే.

మా నాన్న యెంత అమాయకుడో మా అమ్మ అంత గడుసుదనంగల స్త్రీ. మాయింటికి ఆమె ఒక భాగ్యరాశి - జీవితంలోని లోతుపాతుల్ని తెలుసుకున్న యిల్లాలు కావటంవల్ల యెన్ని లోటుపాట్లొచ్చినా సంసారాన్ని సాఫీగా, ఒడుదుడుకు లేకుండా సాగించింది. ముఖ్యంగా నేనంటే మా అమ్మకి ప్రాణం! నేను లేకుండా ఓగడియైనా వుండలేదు. ఇంతవరకూ నన్నామె తన కంటిరెప్పకిమల్లే చూసుకుంటూ వొచ్చింది-" మా బాబు, గొప్పగొప్ప చదువులు చదివితే-పెద్ద ఆఫీ

సరయితే-మేమంతా మంచి బంగళాల్లో వాయిగా వుంటే-" యింకా యింకా యిలాగే గాల్లో యెన్నెన్నో మేడలు కట్టుకునేది. అలాంటి ప్రియమైన అమ్మ యీనాడు వేరయిపోతోంది. అలాంటి పూజ్యదేవత యీవేళ విడిపోతోంది.

యెక్కడో దేవుడు ఆకాశంమీద ఆటలాడు కుంటున్నాడని ఉపదేశాలిచ్చేవాళ్లని చూస్తే నాకు మహాచెడ్డ చిరాకు. పసితనంలో మా అమ్మ నాకు ఉగ్గుబాలతోనే,- "తల్లిదండ్రుల్ని మించి యింకో దైవం లేడు. వారిని సేవించటమే నావిధి అనీ నేర్పింది. యీ నాటివరకూ ఆ బంగారు మాటలు నా గుండెల్లోంచి కదిలిపోలేదు." మా అమ్మా-నాన్నల్ని పోషించేందుకే పుట్టాను. వారి సౌఖ్యంకోసమే నా యీ దేహం తయారయింది. వారికోసమే బ్రతుకుతాను" అంటూ యేవేవో ఉద్రేకభావాలు నాలో రగుల్కొంటూవుండేవి. ఇంతవరకూ ఆ విశ్వాసాలపైనే వారిని సేవించు కుంటూ వొచ్చాను. కాని జీవితాంతంవరకూ వారి దగ్గరే వుండి వారిని సేవించే భాగ్యం నాకు లేక పోయింది.

ప్లాట్ ఫారంపైని మానాన్నతో మాట్లాడా మనుకున్నా - కాని నోరు మెదపలేకపోతున్నా. ఆ సందిగ్ధసమయంలో యేంమాట్లాడాలో పాలు పోవటంలా. అమ్మ కళ్లల్లోంచి విక్టోరియా జల పాతం పొంగుకొస్తోంది. నాగుండెలు విచారంతో ఒడ్డుకి తెచ్చిన చేపకిమల్లే గిలగిల గుంజుకుం టున్నాయ్.

ఇంతలో యెప్పుడూ ఆలస్యంగా వొచ్చేబండి ఆవేళ కాస్త ముందుగానే వొచ్చేసింది నామీద కోపగించుకున్నట్టు బుసలు కొట్టుకుంటూ,— బండిలో కూచున్నానన్న మాటేగాని నాధ్యాసం అంతా మా అమ్మపైనీ, నాన్నపైనీ వుంది. నాన్న అమాయకంగా—దీనంగా నావేపు చూడసాగాడు. మా చిన్నాయన యింకా యేదో ధైర్యం చెప్తు న్నాడు. ఆ విషమ పరిస్థితిలో నేనసలే మూగివా ణ్ణయిపోయాను.

బండి కదిలేందుకి సిదంగావుంది. నాలో దిగులు మరింత యెక్కువయింది మిత్రులంతా నాకు వీడ్కోలిస్తూ చేతిరుమాళ్లు యెగరేయటం మొద లెట్టారు. మొదట్నుంచి ఆఖరు క్షణందాకా అమ్మ నన్ను తన కన్నీటిధారా ప్రవాహాల్తో సాగ నంపింది. నాన్న తన అమాయకపు చూపుల్తో నన్ను సాగనంపేడు. ఇదంతా చూసి నామనసు పిచ్చెత్తి పోయినట్టయింది. ఇంతమంది స్నేహితుల్నొదిలి, అమ్మనీ-నాన్ననీ వొదిలి యెక్కడికో కడుపు కోసరం వెళ్లిపోవటం!—చటుక్న స్మారకం తప్పి పడిపోయాను. బండి కదిలి వెళ్లిపోయింది.

కాసేపటికి తెలివి తెచ్చుకుని మళ్లా లేచి చూశాను. యెవరూ లేరు. మావూరు ప్లాట్ ఫారమూ లేదు. బండిమాత్రం అతి వేగంగా పారిపో తోంది. అమ్మా-నాన్ననీ వొదిలేసి జోరుగా యీ డ్చుకెళ్లిపోతోన్న రైలుని చూసి నాకు పట్టరా నంత కోపం వొచ్చింది. నా కన్నీటిధారల్నీ మా త్రమూ ఆపుకోలేకపోయాను. అంత విచారంలో కూడా నా హృదయం భావోత్తుంగ తరంగాల మధ్యబడి కొట్టుకు పోసాగింది.

యీనాటి చదువులు—

యింగ్లీషు చదువులు—

పాడు వెధవ చదువులు—

తల్లి దండ్రుల్తోగాని, తోటి ప్రజానీకంతో గాని సమ్మంధంలేని యీ చదువులెందుకు? - తమ భావి జీవితాల్ని తమ సంతానంపై కేంద్రీకరించు కుని యెన్నెన్నో ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రు ల్నుంచి పిల్లల్ని విడదీసే యీ చదువు లెందుకు? యెన్ని ఆస్తులు తగలబెట్టుకున్నా ఆఖరికి బానిస ప్రపంచంలోకి లాక్కెళ్లే యీ దిక్కుమాలిన చదువు లెందుకు? - ఈ యింగ్లీషు చదువులు మా తల్లిదండ్రుల్నీ నన్నూ యిలా విడదీస్తాయని తెలి సుంటే ఇంతగా చదవకపోయి వుండేవాణ్ణి.

కలియుగ పిశాచాలయిన సామ్రాజ్యవాదుల పాపపు యింగ్లీషు చదువులు సైతం "విభజించి పాలించే కుతంత్రం" తు. చ. తప్పకుండా అమలు జరుపుతున్నాయని ఆనాడు బోధపడింది. బ్రిటిష్ దొరల మాయాజాలంలో చిక్కుకుపోయి ఎం. ఏ.లూ, బి. యేలకోసం యెగబడే సోదరుల్ని తలంచుకుని నాలో నేనే నవ్వుకున్నాను.

ఇంకా నా జీవితంలో యిలాంటి రోమాంచక మైన అనుభవా లెన్ని పొందాల్సి వుందోగదా!-